ఎరువు కరువు లేకుండా!

- ఆలూరు సబ్ డివిజన్‌లో 84 వేల హెక్టార్లలో సాగుకు అవకాశం
- 10,953 మెట్రిక్ టన్నుల ఎరువులకు ఇండెంట్
- ఆర్బీకేల గోదాములకు చేర్చేందుకు అధికారుల కసరత్తు



ఆర్బీకేల్లో నిల్వ చేసిన ఎరువులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

ఆలూరు రూరల్: వ్యవసాయం రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. సాగుకు ముందే పెట్టుబడి సాయం అందించడం మొదలు చేతికొచ్చిన దిగుబడిని రైతులు విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి ఆదుకుంటోంది. ఖరీఫ్ సీజన్‌కు నెల ముందు నుంచే ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ముందే విత్తనాలు, ఎరువులు కొరత ఏర్పడకుండా సకాలంలో సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 84.730 వేల హెక్టార్ల సాగు విస్తీర్ణం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా ఇందులో 50 హెక్టార్లకు పైగా వర్షాభావంపైనే ఆధారపడి పంటలు పండిస్తారు. మిగిలిన 34 హెక్టార్లు బోర్లు, నీటి ట్యాంకుల కింద రైతులకు పంటలు సాగు చేస్తారు. ఆలూరు సబ్ డివిజన్లో అత్యధికంగా పత్తి పంట సాగు చేస్తారు. దీంతో పాటు మిరప, వేరుశనగ తదితర పంటలు సాగు అవుతాయి. ఈ మేరకు సబ్ డివిజన్‌కు 10,953 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు అంచనా వేశారు. యూరియా, డీఏపీ, ఎంఓపీ ,కాంప్లెక్స్ తదితర ఎరువుల అవసరమవుతాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యాక ఎరువులు దిగుబడి చేసుకుని సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న 76 ఆర్బీకేలకు సరఫరా చేయడం చేయడం కష్టంగా మారుతోంది. ఎరువుల సరఫరా ఏమాత్రం ఆలస్యమైనా రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వచ్చే ఖరీఫ్‌కు ముందస్తుగానే ఎరువుల సరఫరాకు సిద్ధమైంది. ఈ మేరకు అన్ని మండలాల నుంచి ఇండెంట్ పంపించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే అన్ని మండలాల నుంచి వ్యవసాయ అధికారులు అవసరమైన ఎరువులు ఇండెంట్ పంపించారు. ఈ నెల నుంచే ఎరువులు మండల కేంద్రాలకు పంపి అక్కడి నుంచి అన్ని ఆర్బీకేల గోదాముల్లో నిల్వ చేయనున్నారు.

ప్రణాళిక సిద్ధం

2023–24 ఏడాదికి సంబంధించి వ్యవసాయ శాఖ రైతులకు అందించాల్సిన సేవలు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక సిద్ధం చేసింది గత రెండు రోజుల క్రితం అన్ని ఆర్బీకేల ఇంచార్జ్‌లు మండలాల ఏఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. విత్తనాల ఎంపికలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. రైతులకు కావాల్సి ఎరువులు, పురుగుల మందులపై ఆర్బీకేల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పంట నమోదులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు తెలిపి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఆర్డర్ చేసిన వెంటనే సరఫరా..

ఎరువులు అవసరమైన రైతులు ఆర్బీకేలోని కియోస్క్ మిషన్ ద్వారా ఆర్డర్ చేసి నగదు చెల్లించిన వెంటనే ఎరువులు అందించనున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా ఎరువులను ఆర్బీకేలకు తరలించి ముందుగానే సిద్ధం చేస్తారు. మే నుంచి అక్టోబర్ వరకు ప్రతి నెలా ఎప్పటికప్పుడు కావాల్సిన ఎరువులు సరఫరా చేస్తారు. ఎరువుల కొరత లేకుండా సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉంచనున్నారు.

అందుబాటులో ఉంచుతాం



ఖరీఫ్ సీజన్ కోసం ఇప్పటి నుంచి ప్రభుత్వం జిల్లాల నుంచి ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌కు ఎరువులను తరలిస్తోంది. ఇప్పటికే కావాల్సిన ఇండెంట్ ఉన్నతాధికారులకు పంపించాం. ఈ ఖరీఫ్ సీజన్‌కు 10,950 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయి. ఎరువులు నిల్వ చేసేందుకు ఆర్బీకేల పరిధిలో గోదాములు సిద్ధం చేశాం. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తాం.

– సునీత, ఏడీఏ, ఆలూరు

పత్తికొండ డీఎస్పీగా శ్రీనివాసులు



బాధ్యతలు చేపడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

పత్తికొండటౌన్: పత్తికొండ సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు నియమితులయ్యారు. అనంతపురంలో దిశ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నూతనంగా ఏర్పాటైన పత్తికొండ సబ్‌డివిజన్‌కు డీఎస్పీగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పత్తికొండలో బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ డీఎస్పీగా ఉన్న కర్నూలు సీసీఎస్ డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌ఐ గోపాల్, పోలీసు సిబ్బంది నూతన డీఎస్పీకి స్వాగతం పలికారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన విధుల్లో చేరారు. పత్తికొండ సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని డీఎస్పీ తెలిపారు.

ఎస్‌ఐ విరాళం

వెల్దుర్తి: పట్టణ సమీపంలో కర్నూలు క్రాస్ హైవే వద్ద జంక్షన్‌లో ఏర్పాటవుతున్న 51 అడుగుల భారీ అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి రూ.10వేల విరాళం అందించారు. శుక్రవారం ఆయన విగ్రహ నిర్మాణ ప్రాంతానికి వెళ్లి స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన విరాళాన్ని విగ్రహ నిర్మాణకర్త చెరుకులపాడు రామాంజనేయులుకు అందించారు.

క్లుప్తంగా

మొదటి రోజు నుంచే పుస్తకాల పంపిణీ



ఎమ్మార్సీలో పాఠ్య పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ కోమలా దేవి

ఆలూరు రూరల్: వేసవి సెలవుల అనంతరం పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేయనున్నట్లు ఆలూరు ఎంఈఓ కోమలా దేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాల్సిన పుస్తకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలో మొత్తం 51 ప్రాథమిక, ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇందులో మొత్తం 9 వేల మంది విద్యార్థులకు మొదటి విడత కింద 31 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు.

ఉద్యోగాల భర్తీ చేపట్టండి

ఆదోని అర్బన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న జాబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలన్నారు. సమావేశంలో డీఎస్ఎఫ్ నాయకులు రెడ్డి, చిన్నవిజయ్, హరిక్రిష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకప్పస్వామి ఆరాధనోత్సవం



స్వామి వారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

మద్దికెర: బొజ్జనాయునిపేట రహదారిలో రెండు కి.మీ దూరంలో కొలువైన వెంకప్ప స్వామి ఆరాధన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి సమాధిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం దాతలు స్వచ్ఛందంగా వాహనాలు ఏర్పాటు చేశారు. అన్నదాన సౌకర్యం కల్పించారు. పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్, శ్రీలక్ష్మి ప్రజలకు సూచించారు. శుక్రవారం మద్దికెరలోని బీరప్ప దేవాలయం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవడమే గాకుండా ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలు అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం వీధుల్లో పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా బుద్ధపౌర్ణమి వేడుకలు



బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీసీ సంఘంతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు కామలే గణేష్, నాగేంద్ర, రామలింగయ్య, బతకన్న, టీచర్ లచ్చప్ప, నరసన్న, మధుబాబు, కృష్ణ తదితరులు బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ క్రీస్తు పూర్వం 500 ఏళ్ల క్రితం బుద్ధుడు బౌద్ధ మతాన్ని స్థాపించి ప్రజలను ధర్మం వైపు నడిపించారని అన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

హొళగుంద: స్పందన ద్వారా వచ్చిన వినతుల పరిష్కారంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు జిల్లా కేంద్రానికి వెళ్లి స్పందనలో ఫిర్యాదులు చేస్తారని దానికి వెంటనే ఉన్నతాధికారులకు సంజాయిషీ చెప్పాల్సి ఉంటుందన్నారు. వలంటీర్ల, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి బొకే అందజేస్తున్న డీఎస్పీ సీతారామయ్య

ఎమ్మిగనూరుటౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడ్డొదని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి.. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్యకు సూచించారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో శాంతి భద్రతల గురించి చర్చించారు. అలాగే డీఎస్పీని ఆయన కార్యాలయంలో వైఎస్ఆర్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ రథోత్సవం



రేణుకా ఎల్లమ్మ రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: పట్టణ గ్రామదేవత రేణుకా ఎల్లమ్మ రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేలాది మంది మహిళా భక్తులు బోనాలు సమర్పించి, కుటుంబ సమేతంగా విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం రేణుకా ఎల్లమ్మ అమ్మవారు, ఆమె కుమారులు జంపన్న, పరుశరాముడుల ఉత్సవమూర్తులను ప్రత్యేకాలంకరణ గావించి రథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. తిరుణాల సందర్భంగా వెలసిన అంగళ్లలో ఆడపడుచుల గాజుల కొనుగోళ్లు, పిల్లల బొమ్మల కొనుగోళ్లు సాగాయి. రథోత్సవంలో ఎల్లమ్మ గుడి ధర్మకర్తలు, బ్రహ్మగుండం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రఘురెడ్డి, వడ్ల ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బీరలింగేశ్వరుడికి పల్లకీ సేవ

నందవరం: కురబల ఆరాధ్యాదైవం బీరలింగేశ్వరుడి పెద్ద దేవర సందర్భంగా శుక్రవారం గ్రామంలో స్వామి వార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కట్ట పరిధిలోని 72 గ్రామాల భక్తులు బండారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కుంభోత్సవం ఉంటుందని, ఆలయం వద్ద వానాల రాకపోకలు ఇబ్బందులు ఉంటాయని వాహనదారులు సహకారించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత తరగతులు

ఆలూరు: వారం రోజుల నుంచి స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. సీనియర్ అధ్యాపకులు శ్రీనివాసరావు, చిరంజీవి, బాబు, పద్మావతి తదితరులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సాంకేతిక విద్యలో రాణించాలన్నారు. ఇప్పటి వరకు 200 మందికి శిక్షణ ఇచ్చామన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

కృష్ణగిరి: వ్యవసాయంలో రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన రైతులకు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గ్రామాల పరిధిలోని ఆర్‌బీకేల ద్వారా మట్టి నమునాలను సేకరించడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు తమ పొలాన్ని భూసార పరీక్ష చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్ష అనుగుణంగా పంటలకు చీడపీడలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తం

కృష్ణగిరి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ప్రజలు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి శుక్రవారం తెలిపారు. తడిసిన స్తంభాలను ఎవ్వరూ తాకవద్దని, ఇంట్లో ఏదైనా విద్యుత్ సమస్య ఏర్పడితే వెంటనే విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ పంపుసెట్ల వద్ద కూడా ఈ వర్షాలకు రైతులు కనీస జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కుందనగుర్తిలో పెద్దమ్మ అవ్వ విగ్రహ ప్రతిష్ఠ

చిప్పగిరి: మండలంలోని కుందనగుర్తి గ్రామంలో శ్రీపెద్దమ్మ అవ్వ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అఘోరాలు హాజరు కావడంతో వారి దర్శనం కోసం భక్తులు గ్రామ ప్రజలు ఎగబడ్డారు. అమ్మవారికి 33 తులాల వెండి ముఖ కిరీటాన్ని గ్రామ సర్పంచ్ కొండా పురుషోత్తంబహుకరించారు.కార్యక్రమంలోగ్రామ ప్రజలు, భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన

వెల్దుర్తి: బోయనపల్లె గ్రామ పరిధిలో కొలువైన గురుశిష్యులు రాధాస్వామి, ఆదోని లక్ష్మమ్మ అవ్వల ఆరాధన శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆనవాయితీగా ఆలయ ప్రాంతం నుంచి స్టేజ్ అవతల ఉన్న పొలాల్లోని ఆంజనేయస్వామిగా భావించే బావి వద్దకు గండదీపంతో వెళ్లి పూజలు నిర్వహించిన భక్తులు తిరిగి గుడి వద్దకు దీపాన్ని చేర్చారు. బోయనపల్లె, రామళ్లకోట తోపాటు చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు వేలాదిగా తరలివచ్చి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. నందికోలసేవ అలరించింది.

అడ్మిషన్ల పేరుతో దోపిడీని నియంత్రించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో చేసే దోపిడీని నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అజిత్, విజయ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు ఎంఈఓ ఆంజినేయులుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులను వేలాది రూపాయలు వసూలు చేస్తున్న అడ్డుకోలేకపోతున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ అనుమతుల్లేకుండా అడ్మిషన్లు చేసే ఆయా పాఠశాలలపై ఎంఈఓ చర్యలు తీసుకోవాలన్నారు.

పకడ్బందీగా విత్తనాల పంపిణీ

- పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్



దేవనకొండలో ఎరువుల షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఆర్‌బీకేల ద్వారా పకడ్బందీగా విత్తనాల పంపిణీ చేపడతామని పత్తికొండ వ్యవసాయ సబ్‌డివిజన్ సంయుక్త సంచాలకులు మోహన్ విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన దేవనకొండలో శుక్రవారం వివిధ ఎరువుల షాపులను ఆయన ఏఓ సురేష్‌బాబుతో కలసి తనిఖీ చేశారు. రికార్డులు, నిల్వ ఉంచిన ఎరువులు, విత్తనాలను ఆయన పరిశీలించారు. అనంత రం విలేకరులతో మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే షాపులను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన కంపెనీలకు చెందిన ఎరువులు, విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేసుకోవాలని, ఆ మేరకు రసీదులు పొందాలన్నారు.

భూ రీసర్వే వేగవంతం

మద్దికెర: మండలంలో భూ రీసర్వేను వేగవంతం చేస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పొలాలపై సర్వే చేసిన మ్యాప్‌లను గ్రామాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. హద్దులపై రైతులకు అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలియజేస్తే వాటిని పరిశీలించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు.

బాధితులను ఆదుకోవాలి

మద్దికెర: వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి హనుమప్ప, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోదండరాముడు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో పంటలు సాగు చేసి చేతికి వచ్చే సమయంలో వానలు కురవడంతో పూర్తిగా నష్టపోయారన్నారు. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే పరిహారం ప్రకటించాలన్నారు.

మోటార్ రివైండింగ్, పంపుసెట్ రిపేరీలో ఉచిత శిక్షణ

మద్దికెర: కెనరాబ్యాంక్ వారి సౌజన్యంతో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంతంలోని రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగిన నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్, పంపుసెట్ రిపేరీలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. 18–45 సంవత్సరాలలోపు వున్న ఆసక్తి గల యువకులు 9000710508ను సంప్రదించాలని సూచించారు. ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలన్నారు.

ఆ కళాశాలపై చర్య తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: అనుమతుల్లేకుండా పట్టణంలో ఏర్పాటు చేసిన జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాలపై చర్య తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు విజయేంద్ర, రంగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు లేకుండా ప్రారంభించి విద్యార్థుల తల్లిదండ్రులను మోసపూరిత ప్రకటనలతో కళాశాల యాజమాన్యం మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రవేశాల పేరుతో వేలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేసేందుకు ఉపక్రమిస్తున్న కళాశాల యాజమాన్యంపై ఇంటర్ బోర్డ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమీవుల్లా, ఖాదర్, సమీర్, రామాంజినేయులు పాల్గొన్నారు.

సారా బట్టీ ధ్వంసం

ఆలూరు రూరల్: మండలంలోని ఆరికెర తండా గ్రామ శివారు కొండల్లో నాటుసారా తయారీ బట్టీని ధ్వంసం చేసినట్లు ఆలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు. తండాకు చెందిన సేవ్యా నాయక్‌కు అదుపులో తీసుకుని నాటుసారా బట్టీని ధ్వంసం చేసి.. వంద లీటర్ల బెల్లం ఊట పారబోసామన్నారు. 6 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని సేవ్యా నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ తెలిపారు.

తెక్కలకోట జాతరకు తరలిన భక్తులు



హొళగుంద నుంచి మల్లేశ్వరుడిని వరించిన స్వామితో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

హొళగుంద: కర్ణాటకలోని బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా తెక్కలకోట గ్రామ కొండల్లో వెలిసిన హొళగుందలోని బోయ కులస్తుల ఆరాధ్య దేవుడు వరవిన మల్లేశ్వరస్వామి జాతరకు శుక్రవారం స్థానిక భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తెక్కలకోట గ్రామానికి 4 కి.మీ దూరంలోని కొండలో వెలసిన వరవిన మల్లేశ్వరస్వామికి ఏటా రథోత్సవం నిర్వహిస్తారు. కాగా ముందుగానే దేవుడికి బండారం సమర్పించేందుకు మల్లేశ్వరుడిని వరించిన స్వామితో కలిసి భక్తులు డోలు, మేళ తాళాలతో హొళగుంద నుంచి కర్ణాటకకు ఊరేగింపుగా వెళ్లడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం హొళగుందకు దాదాపు 30 కి.మీ. దూరంలో ఉన్న స్వామి సన్నిధికి చేరుకునేందుకు చెప్పులు లేకుండా కాలినడకతో కర్ణాటకకు బయలుదేరారు. అగ్రహారం బోయ కులస్తులు వెళ్లేంతవరకు అక్కడ ఎలాంటి ఉత్సవ కార్యక్రమాలు మొదలు కావు. స్వామిని కొలిచే ఇక్కడి భక్తులు రథోత్సవానికి ముందు వచ్చే అమావాస్య నుంచి 15 రోజుల పాటు కఠోర దీక్షను పాటిస్తారు. కటిక నేలపై పడుకోవడం, దాంపత్య జీవనానికి దూరంగా, మద్యం తాగకుండా ఉండడం, చెప్పులు లేకుండా తిరగడం లాంటి దీక్షలు చేస్తారు. శుక్రవారం సాయంత్రం తెక్కలకోట సమీపంలోని కొండల్లో వెలసిన స్వామి సన్నిధికి చేరుకున్న భక్తులు కొండపై వెలిసిన ఆలయంలో ఉన్న 60 కేజీల వెండి త్రిశూలాన్ని, దేవుడిని దిగువకు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కనుల పండువగా రథోత్సవం నిర్వహించారు. శనివారం మల్లేశ్వరునిపై అలిగి దూరంగా ఉంటున్న మాళమ్మ విగ్రహాన్ని తెచ్చి మల్లేశ్వరునితో వివాహం జరుపుతారని వాల్మీకి పెద్దలు చెప్పారు. ఈ సందర్భంగా కొత్త దంపతులు, భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపనకు తరలిరండి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న వీరశైవ లింగాయత్‌లు

హొళగుంద: ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ సర్కిల్‌లో ఆదివారం జరిగే విశ్వగురు, జగజ్యోతి బసవేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు వీరశైవ లింగాయత్‌లు, బసవేశ్వరస్వామి భక్తులు తరలిరావాలని ఆదోనికి చెందిన వీరశైవ సమాజ సేవా సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం హొళగుందలోని వీరభద్రేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో కార్యక్రమానికి చెందిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నందవరం: మండల పరిధిలోని ముగతి ఏపీ మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరం సంబంధించి 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 9వ తేదీ నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. www.cse.ap.gov.in/ apms. ap.gov.in అనే వైబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. ప్రవేశ పరీక్ష జూన్ 11న స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఉదయం 11 గంటలకు ఉంటుందని తెలిపారు.

మద్దికెరలో భారీ వర్షం



పొలాల్లో నిలిచిన నీరు

మద్దికెర: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. 9.6 సెం.మీ వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పొలాలలో వర్షపునీరు ప్రవహించింది. అలాగే రైల్వే బ్రిడ్జి కింద నీరు నిల్వడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సైలెన్సర్‌లోకి నీరు పోవడంతో బస్సు నిలిచిపోయింది. స్థానికుల సహాయంతో బయటకు తీశారు.

దారులన్నీ గుడేకల్ వైపే..

- నేడు అల్లీపీరా స్వాముల ఉరుసు
- ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులు

కాలినడకన గుడేకల్‌కు చేరుకుంటున్న ఇతర ప్రాంతాల భక్తులు



దర్గాలో మొక్కులు తీర్చుకుంటూ..



దర్గా ఆవరణలో సేద తీరిన భక్తులు

ఎమ్మిగనూరురూరల్: గుడేకల్ గ్రామంలో శనివారం జరిగే సద్గురు అల్లీపీరాస్వాముల ఉరుసుకు భక్తులు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి, దర్గా ట్రస్ట్ ప్రెసిడెంట్ గురు గాజిహుసేన్‌పీరా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి స్వామి ప్రభోదనలు, శనివారం తెల్లవారుజామున గంధం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు గుడేకల్‌కు చేరుకుంటున్నారు. దర్గా ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి కల్పించారు. అలాగే దూర ప్రాంతాల నుంచి భక్తుల సౌకర్యార్థం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో గట్టి బందోబస్త్ చేపట్టారు.